క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు పర్యవేక్షించారు.

కొండపిలో 767 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, చవటపాలెం, దాదా నాయుడుపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి గ్రామాల రైతులు 830 బేళ్లు తీసుకురాగా 767 కొనుగోలయ్యాయి. వివిధ కారణాలతో 53 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.201, అత్యల్ప ధర రూ.151, సరాసరి ధర రూ.198.72 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

నూరు శాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు

సింగరాయకొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు అందజేయనున్నట్లు ఏపీఓ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలలోపు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, తైవాన్‌జామ, గులాబీ, మల్లె, సీతాఫలం, యాపిల్‌బేర్, దానిమ్మ, నేరేడు, మునగ రకం మొక్కలు అందజేస్తామని తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు తమ పేర్లను ఎంపీడీఓ, ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

మెరుగైన వైద్యం ధ్యేయం

ఉలవపాడు: ప్రతి రోజూ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన ఆరోగ్య విద్య అందించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కేర్ కంపానియన్ ప్రోగ్రామ్ అసోసియేట్ టి.వాసవి తెలిపారు. శుక్రవారం ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల మరణాలు జరగకుండా చూడాలన్నారు. దీనికి సంబంధించి ఇటీవల శిక్షణ పొందిన నర్సింగ్ స్టాఫ్ పర్వీన్, సౌమ్యలకు సర్టిఫికెట్లు అందించారు. వైద్యులు సతీష్, శివానంద్, సురేష్, ఐశ్వర్య, శ్రీజరెడ్డి తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు పేదలకు వరం


కంటి పరీక్షలకోసం పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

పామూరు: అందరికీ కంటిచూపు ఉండాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించిందని బొట్లగూడూరు డాక్టర్ యం.విజయ్‌కుమార్, డాక్టర్ డి.హరిబాబు అన్నారు. శుక్రవారం 150 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రవళి ప్రియాంక, సీహెచ్‌వో ఎ.మురళి, హెచ్‌ఈవో శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి జగనన్నకు చెబుదాం

గుడ్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 5న సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ శుక్రవారం తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత


చెక్కును పంపిణీ చేస్తున్న హుసేన్ రెడ్డి

పామూరు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదల ఆరోగ్యానికి ధీమా అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేగిచట్లపల్లె గ్రామానికి చెందిన మూలా కొండమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.1.10 లక్షల చెక్‌ను అందజేశారు. మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యాన అధికారుల పోస్టులు భర్తీ


జిల్లా ఉద్యాన అధికారి గోపీ చంద్

కనిగిరి రూరల్: రాష్ట్రంలో 39 మంది ఉద్యాన అధికారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి వై. గోపీచంద్ తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఉద్యాన అధికారుల ఎంపిక పూర్తి అయ్యిందని, త్వరలో నియామకాలు జరుగుతాయన్నారు. జిల్లాలో 11 ఉద్యాన పోస్టులకుగాను 7 మంది ఉన్నారని, కనిగిరి, పామూరు, గిద్దలూరు, దర్శి ఫాంలో ఖాళీలున్నాయన్నారు.

విద్యకే పెద్ద పీట


మహమ్మదాపురం ప్రాథమిక పాఠశాల


మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగు నీటి ట్యాప్‌లు

- నాడు- నేడు పనులతో తల్లిదండ్రుల హర్షం
- ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో హాజరు పెరిగే అవకాశం

హనుమంతునిపాడు: నాడు నేడుతో పథకంతో విద్యా వ్యవస్థలో పాఠశాలలు రూపు రేఖలు మారి పోయాయి. మండలంలో మొదటి విడతలో 29 పాఠశాలలు, రెండో విడతలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 13 అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నపాఠశాలల్లో 3025 మందికి పైగా ఉన్నారు. ఈ ఏడాది ఉన్నత పాఠశాలల్లో హాజరు శాతం పెరుగుతుందని విద్యా శాఖాధికారులు చెప్తున్నారు.

అంకమ్మ తల్లికి విరాళం


విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

కందుకూరు: అంకమ్మ తల్లి ఆలయ పునః నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయి. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో మరో భక్తుడు విరాళం అందజేశాడు. రిటైర్డు హౌసింగ్ డీఈ పాలువూరి నాగేశ్వరరావు, పద్మజ, కుమారుడు పవన్‌కుమార్‌ల తరఫున రూ.25,116 అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక మంది భక్తు పెద్ద సంఖ్యలో సహకరిస్తున్నారని తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య, కొండూరి వసంతరావు, సూరం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

జరుగుమల్లి(సింగరాయకొండ): జగనన్న లేఔట్లలో పేదలకు కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పంచాయతీలోని లేఔట్‌లో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామంలోని రెండు లేఔట్లలో 45 మందికి స్థలాలు మంజూరు చేయగా 17 గృహాలు పూర్తయ్యాయన్నారు. కొన్ని గృహాలు వివిధ దశల్లో ఉండగా, పలువురు నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. పది రోజుల్లో అన్ని ప్లాట్లలో నిర్మాణాలు ప్రారంభం కావాలని, లేదంటే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని సూచించారు. హౌసింగ్ ఏఈ అవినాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఏపీఎం భాగ్యలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లింగసముద్రం: మాట్లాడుతున్న డీఎల్‌డీఓ పద్మజ

లింగసముద్రం: జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ పి.పద్మజ అన్నారు. శుక్రవారం యర్రారెడ్డిపాలెంలో ఎంపీడీఓ శేషుబాబుతో కలిసి లే అవుట్లు పరిశీలించారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పక్కా గృహాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం లింగసముద్రం-1, పెంట్రాల, యర్రారెడ్డిపాలెం గ్రామ సచివాలయాల్లో రికార్డులను, హాజరుపట్టీ, బయోమెట్రిక్ పరిశీలించారు.

పొన్నలూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.లక్ష్మీరెడ్డి సూచించారు. మండలంలోని చెరుకుకొమ్ముపాలెం, పరుచూరివారిపాలెం గ్రామాల్లో లేఔట్లను శుక్రవారం సందర్శించి అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. స్థలం పొందిన వారు ఇంటి నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దుచేసి ఆ స్థలాన్ని మరొకరికి కేటాయిస్తామని హెచ్చరించారు. అనంతరం బోగనంపాడు సచివాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వరరావు, సర్పంచ్ బడుగు సత్యకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.


జరుగుమల్లి(సింగరాయకొండ): మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ


పొన్నలూరు: బోగనంపాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మీరెడ్డి

గృహ నిర్మాణాలపై చైతన్యం కల్పించండి

కనిగిరి రూరల్: జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టేందుకు అధికారులు లబ్ధిదారుల్లో చైతన్యం, అవగాహన కల్పించాలని మండల అభివృద్ధి అధికారి, జిల్లా ఉద్యాన అధికారి వై. గోపీ చంద్ అన్నారు. మండలంలోని బల్లిపల్లిలో గల జగనన్న లే ఆవుట్ కాలనీ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా, స్వయం సహాయక సంఘాల్లోని గ్రూపు సభ్యులకు అందిస్తున్న రుణాలను అందించి, వారిని గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రోత్సాహించాలన్నారు. చాకిరాల గ్రామానికి చెందిన అనేక మంది ప్రజలు జగనన్న కాలనీలు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ దంతులూరి ప్రకాశం శుక్రవారం మండల అభివృద్ధి అధికారికి తెలిపారు. గతంలో చాకిరాలలో వేసిన లే ఆవుట్‌లో అనేక మంది పేదలకు, అర్హులకు పట్టాలు ఇచ్చారని, అయితే టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లడంతో అక్కడ జగనన్న లే ఆవుట్ కాలనీ ప్రస్తుతం నిలిచిందన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిర్మాణం జరిగిన చాకిరాల రెవెన్యూ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద నాలుగు ఎకరాల భూమి ఉందని, అస్థంలో చాకిరాల గ్రామానికి చెందిన పేదలకు జగనన్న లేఆవుల్ కాలనీ మంజూరు చేయాలని విన్నవించారు.


కనిగిరి: బల్లిపల్లిలో జగనన్న లే ఆవుట్‌ను పరిశీలిస్తున్న అభివృద్ధి అధికారి

ఉద్యాన అధికారిని నియమించండి

కనిగిరి మండల ఉద్యాన అధికారి ఎవరో తమకు తెలియదని ఎంపీపీ ప్రకాశం అన్నారు. పొదిలి ఇన్‌చార్జి అధికారి కన్నెత్తి చూడటం లేదన్నారు. జిల్లాలో అత్యధికంగా కనిగిరి ప్రాంతంలోనే నిమ్మ, బత్తాయి తోటలు ఉన్నాయని, ఇక్కడ రైతులకు సూచనలు సలహాలు ఇచ్చే దిక్కులేదని చెప్పారు.

పాఠశాల వాచ్‌మన్ ఎంపిక ఏకగ్రీవం

హనుమంతునిపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్‌మన్ పోస్టుకు ముగ్గురు దరఖాస్తులు చేసుకోగా కుకింగ్ హెల్పర్‌గా పని చేస్తున్న కల్లగుంట్ల చెన్న లక్ష్మీ భర్త కల్లగుంట్ల కొండలరావును శుక్రవారం ఎంపిక చేశారు. ఈ ఎంపిక డీప్యూటీ డీఓ చంద్రమౌళీశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్మానం చేసి ఎంపిక చేశారు. కాగా ఇటీవల ఎంపిక కమిటీకి చెప్పకుండానే హెచ్‌ఎం ఏక పక్షకంగా కల్లగుంట్ల కొండలరావును ఎంపిక చేశారని కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు అందింది. దీంతో డీఈఓ ఆదేశాల మేరకు మే 31న పాఠశాలో ఇరువర్గాల సభ్యులను పిలిపించి మండల విద్యాశాఖాధికారి, హెచ్‌ఎం ఆధ్వర్యంలో విచారణ చేసి నివేదికను జిల్లా అధికారులకు అందించారు. తిరిగి జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం విద్యా కమిటీ సభ్యులను హాజరు పర్చారు. విద్యా కమిటీ చైర్మన్ ఎలిక తిరుపతయ్య అధ్యక్షతన పాఠశాల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి 18 మంది సభ్యులు హాజరయ్యారు. పోస్టు కోసం కుకింగ్ హెల్పర్‌గా పని చేస్తున్న వారి భర్తలు కల్లగుంట్ల కొండలరావు, నాలి కొండయ్య, ఆర్నూరి చెన్నయ్య దరఖాస్తు చేసుకున్నారు. సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించి కల్లగుంట్ల కొండలరావును పాఠశాల నైట్ వాచ్‌మన్‌గా ఎంపిక చేశారు. పాఠశాల చైర్మన్ ఎలిక తిరుపతయ్య, హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు సింగిల్ విండో అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ కత్తిరాజారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వరరావు

ఘనంగా వెంకటేశ్వర కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్దేశ్వర స్వామి పీఠపాలిత శ్రీగిరి శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. పరాంకుశం సీతారామాచార్యులు బృందం శుక్రవారం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ట్రైనీ ఐఏఎస్ అధికారి శౌర్య పటేల్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఆటూరు వెంకట రమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్యనిర్వాహణ ధర్మకర్త సి.వి రామకృష్ణారావు, జై.శంకర్, కలెక్టర్ దినేష్ కుమార్, ట్రైనీ ఐఏఎస్ శౌర్య పటేల్‌లను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.


కలెక్టర్ దినేష్ కుమార్‌ను సత్కరిస్తున్న వేదపండితులు

సాయంత్రం శ్రీవారి తిరువీధి ఉత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మే నెల 29న త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన శ్రీగిరి శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

మాలకొండ ఆదాయం రూ.1.13 కోట్లు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం: మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం 13 వారాల హుండీ ఆదాయం రూ.1,13,68,221 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.బి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బంగారం 248 గ్రాములు, వెండి 2 కేజీల 4 గ్రాములు వచ్చినట్లు తెలియజేశారు. ప్రత్యేక అధికారి వై. బైరాగి, డీఎస్పీ రామచంద్ర, ఎస్సై మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొండపి ఏఓ


బాధ్యతలు చేపడుతున్న విజయకుమార్

కొండపి: కొండపి నూతన వ్యవసాయ శాఖాధికారిగా డి.విజయకుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ సిబ్బంది సహకారంతో మండలంలోని రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని పేర్కొన్నారు. పొదిలి భూసంరక్షణ విభాగం నుంచి కొండపి వ్యవసాయశాఖాధికారిగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం


కాలిపోతున్న వరిగడ్డి వాములు

అద్దంకి: ప్రమాదవశాత్తు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమచారం మేరకు గ్రామానికి చెందిన అడుసుమల్లి మురళి, అడుసుమల్లి రాదయ్య, కమ్మ శ్రీనివాసరావు, కమ్మ వెంకటేశ్వర్లు, నర్రా శ్రీదేవి, గండు చిరంజీవి గ్రామానికి తూర్పు వైపున గుండ్లకమ్మకు వెళ్లే రహదారి పక్కన స్థలాల్లో వరుసగా పశువుల మేత కోసం వాములు వేసుకున్నారు. సుమారు 15 ఎకరాల్లో గడ్డిని పొరు వాములుగా వేసుకోగా, శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వాముల నుంచి మంటలు ఎగసిపడటంతో అక్కడికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికుల సమాచారం మేరకు ఫైరింజన్ వచ్చేసరికి ఆరు వాములు దగ్ధమయ్యాయి. ఏడో వామిని అగ్నికి ఆహుతి కాకుండా కాపాడారు. కాలిపోయిన వాముల విలువ సుమారు 1.80 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. బహిర్భూమికి వచ్చి ఆకతాయిలు విసిరేసిన సిగరెట్టే ప్రమాదానికి కారణం అయి ఉండవచ్చని బాధితులు భావిస్తున్నారు.

విద్యుదాఘాతానికి మూడు గేదెలు బలి

కొమరోలు: విద్యుదాఘాతానికి మూడు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని గోహరపల్లె సమీపంలో శుక్రవారం జరిగింది. బుధవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు గోహరపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అయితే విద్యుత్ సరఫరా అవుతూనే ఉంది. శుక్రవారం కసినేపల్లి గ్రామానికి చెందిన పాడి రైతులు గేదెలను మేత కోసం పొలాలకు పంపించగా గోహరపల్లె గ్రామ సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లను తగలడంతో 3 గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

దుకాణాలపై సేల్స్‌ట్యాక్స్ అధికారుల దాడులు

కంభం: పట్టణంలోని వ్యాపార దుకాణాలపై శుక్రవారం సేల్స్‌ట్యాక్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా అధికారులు దుకాణాలకు సంబంధించిన లైసెన్సు పత్రాలు, ఇతర బిల్లులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలని సూచించారు.

నేడు భూములకు కౌలు వేలం

తాళ్లూరు: బొద్దికూరపాడులో మాధవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయ భూములు కౌలు సాగుకు శనివారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మాధవస్వామి దేవస్థానానికి సంబంధించి 46.47 ఎకరాలు, సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 43.93 ఎకరాల సాగుకు కౌలు పాట మాధవస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు తగిన డిపాజిట్ చెల్లించి దేవదాయ శాఖ నిబంధనల మేరకు కౌలు పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు వాగుమడుగు పోలేరమ్మ తిరునాళ్ల


ముస్తాబైన ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో ఆదివారం ఏరువాక పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా జూన్ నెలలో వచ్చే పౌర్ణమి రోజున గ్రామస్తులు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వాగుమడుగు, రేగడపల్లి, అంబాపురం, గనివానిపాడు, బోడపాడు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుంటారు. శనివారం నిలుపు ఉత్సవంతో జాతర ప్రారంభం కానుండగా, ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో ఏడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు పలువురు దాతలు ఏర్పాట్లు చేశారు.

పథకాల ప్రగతి వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

కనిగిరి రూరల్: ప్రభుత్వ పథకాల ప్రగతిని వేగవంతానికి అధికారులంతా బాధ్యతా యుతంగా పనిచేయాలని జిల్లా ఉద్యాన అధికారి, మండల అభివృద్ధి అధికారి వై. గోపిచంద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాల అభివృద్ధిపై సమీక్ష చేశారు. మండలాల వారీగా ప్రగతి నివేదికలపై చర్చించారు. ఎంపీపీ ప్రకాశం, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, డీఈఈ తిరుమలరావు, కోటిరెడ్డి, షారూన్, ఎంఈఓ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్, టిప్పర్ ఢీ

- డ్రైవర్‌కు గాయాలు

తర్లుపాడు: ఆయిల్ ట్యాంకర్ టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం తాడివారిపల్లి ఘాట్ రోడ్డులో జరిగినట్లు ఎస్సై వి.సుధాకర్ చెప్పారు. పొదిలి వైపు వెళ్తున్న టిప్పర్, పొదిలి నుంచి తాడివారిపల్లి వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ పరస్పరం ఢీకొనడంతో ట్యాంకర్ డ్రైవర్ అఖిలేష్ కుమార్ యాదవ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి గాయాలు

జే.పంగులూరు: రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని ముప్పవరం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. ముప్పవరం గ్రామానికి చెందిన కొమ్ము అశోక్‌బాబు తన బైక్‌పై ముప్పవరం సమీపంలో బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు పక్క ఆగిఉన్న కారును ఢీకొన్నాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

చట్టాలపై అవగాహన

బల్లికురవ: ప్రజలు ఐక్యతతో కలిసిమెలసి జీవించాలని అప్పుడే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ పిలుపునిచ్చారు. గ్రామ దర్శినిలో భాగంగా శుక్రవారం కొణిదెన గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రజలకు చట్టాలు, కేసులపై అవగాహన కల్పించారు. కక్షలు, కార్పణ్యాలకు పాల్పడితే కుటుంబాలు చిన్నాభిన్నంతో పాటు సమయంలో డబ్బు వృథా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో బల్లికురవ ఎస్సై వీ. వేమన పాల్గొన్నారు.